ప్రాణం పోసే అవయవదానం

ఒక వ్యక్తి అవయవాలతో 18 మందికి పునర్జన్మ

- అపోహలు, అనుమానాలతోనే చాలామంది దూరం
- అవగాహన కార్యక్రమాలతో ముందుకొస్తున్న దాతలు
- వ్యాపారాత్మక ధోరణికి అడ్డుకట్ట పడాలంటున్న నిపుణులు

నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

- 8లో

రాయి క్వారీలో నిబంధనల పాతర

బండరాళ్ల కోసం బోరు బ్లాస్టింగులు జరుపుతున్న నిర్వాహకులు







క్వారీలో భారీ పేలుళ్ల కారణంగా రాజన్నపేటలో దెబ్బతిన్న ఇళ్లు

- కంపిస్తున్న రాజన్నపేట గ్రామం
- బీటలు వారుతున్న ఇళ్ల గోడలు, దెబ్బతింటున్న శ్లాబులు
- ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళితో రోగాలబారిన గ్రామస్థులు
- సాగుకు పనికిరాకుండా పోతున్న పంట పొలాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

రోలుగుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని రాజన్నపేట సమీపంలో వున్న రాయి క్వారీ నిర్వాహకులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. కొండపై పెద్ద ఎత్తున బోరు బ్లాస్టింగులు నిర్వహిస్తున్నారు. భారీ పేలుళ్ల ధాటికి సమీపంలోని ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి. పేలుళ్లు జరిపే సమయంలో భూకంపం వచ్చిందన్నట్టు ప్రకంపనలు వస్తున్నాయి. పేలుళ్ల ధాటికి బండరాళ్లు వచ్చి గ్రామంపై పడుతున్నాయి. పెద్దఎత్తున దుమ్ము, ధూళి ఎగిసిపడుతుండడంతో ప్రజలు, పంటలు కాలుష్యం బారిన పడుతున్నాయి. క్వారీ సమస్యపై సుమారు నెల రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాలిలా వున్నాయి.**

మండలంలోని శరభవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 216, 231, 232లలో రాజన్నపేట గ్రామానికి సమీపంలో కొండ వుంది. ఇక్కడ రాయి తవ్వకాల (మైనింగ్) కోసం ఏకా వీర్రాజు అనే వ్యక్తి పేరు మీద గనుల శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. వేరే వ్యక్తులు లీజుకు తీసుకుని క్వారీ నిర్వహిస్తున్నారు. రాంబిల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ నేవల్ బేస్ (ఎన్‌ఏవోబీ) పనులకు ఇక్కడి కారీ నుంచి భారీ బండరాళ్లను తరలిస్తున్నారు. ఇందుకోసం క్వారీలో పలుచోట్ల 50-60 అడుగుల లోతున యంత్రాలతో రంధ్రాలు చేసి, వాటిల్లో జిలెటిన్ స్టిక్స్‌ను అమర్చి ఏక కాలంలో పేలుళ్లు (బోరు బ్లాస్టింగులు) నిర్వహిస్తున్నారు. సుమారు ఏడాదిన్నర నుంచి క్వారీలో రాయి తవ్వకాలు జరుగుతున్నాయి. పేలుళ్ల ధాటికి



రాజన్నపేట సమీపంలో రాయి క్వారీ

రాజన్నపేట గ్రామం కంపించిపోతున్నది. పలు ఇళ్ల గోడలు బీటలు వారాయి. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. పేలుళ్ల సమయంలో దుమ్ము, ధూళి ఎగిసి నివాసాలు, పంట పొలాలపైకి వస్తున్నది. దీంతో పలువురు శ్వాసకోశ సంబంధ వ్యాధులబారిన పడ్డారు. పొలాల్లో పంటలపై తెల్లటి బూడిదలా పేరుకుపోయి, దిగుబడులు తగ్గిపోతున్నాయి. క్వారీకి సమీపంలో వున్న పొలాలు పంటల సాగుకు పనికిరాకుండా పోయాయి. సమస్య నానాటికీ తీవ్రతరం అవుతుండడంతో ఇటీవల క్వారీ వద్దకు వెళ్లి బండరాళ్లను రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. గత గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా చేశారు. మరుసటి రోజు జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్‌రాజు రాజన్నపేట వెళ్లి గ్రామస్థులతో కలిసి ... మిగతా 8వ పేజీలో

సాగని పేదల ఇళ్ల పనులు

ప్రభుత్వం అదనపు సాయం అందించినా కదలిక లేని వైనం

- వైసీపీ హయాంలో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం

- నాటి ప్రభుత్వం ఇచ్చిన నిధులు చాలకపోవడంతో మధ్యలో ఆపేసిన లబ్ధిదారులు
- అదనపు సాయం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- తొలి విడత 5,797 ఇళ్లకు రూ.7.35 కోట్లు మంజూరు
- మార్చిలోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ
- ఇంతవరకు పూర్తికాని ఇళ్ల నిర్మాణం
- నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- పనులు చేపట్టని వారి నుంచి సొమ్ము రికవరీకి సిద్ధం



సబ్బవరం మండలం అసకపల్లిలో నత్తనడకన గృహనిర్మాణ పనులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) **గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అసంపూర్తిగా వున్న పేదల గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం అదనపు సాయం అందించింది. కొందరు లబ్ధిదారులు ఇంటి పనులు పూర్తి చేసేందుకు ముందుకు రాకపోవడంతో అధికారులు శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ సాయం నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినా ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారికి గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. గడువు లోగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయకపోతే అదనపు సాయం డబ్బులను వెనక్కు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.**

గత వైసీపీ ప్రభుత్వం ప్రస్తుత అనకాపల్లి జిల్లా పరిధిలో పేదలకు సొంత ఇళ్ల నిర్మాణం కోసం 685 లేఅవుట్‌లు వేసి 58 వేల పైచిలుకు ఇళ్లను మంజూరు చేసింది. కొన్ని గ్రామాల్లో కొండవాలు ప్రదేశాలు, నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలు, గెడ్డ వాగుల పక్కన లేఅవుట్‌లు వేయడంతో చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. కొంతమంది ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మాత్రమే మంజూరు చేసింది. ఈ నిధులు చాలకపోవడంతో అనేక మంది పనులు మధ్యలోనే ఆపేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం అదనపు సాయాన్ని మంజూరు చేసింది. తొలి దశలో 5,797 అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు నివేదిక ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఎస్సీ, బీసీ లబ్ధిరులకు రూ.50 వేల చొప్పున, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున మొత్తం రూ.7.35 కోట్లు మంజూరు చేసింది. గత మార్చి నెలలో ఈ సొమ్ము ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. కానీ ఇంతవరకు చాలాకొద్ది ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మొత్తం 5,797 ఇళ్లకుగాను 3,115 మంది మాత్రమే ఇంతవరకు పనులు మొదలుపెట్టారు. మిగిలిన 2,682 మంది పనులు ప్రారంభించలేదు. అధికారులు ఎన్నిసార్లు చెప్పినా.. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడంలేదు. ప్రభుత్వం అందించిన అదనపు సాయాన్ని కొంతమంది సొంతానికి వినియోగించుకున్నట్టు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ... మిగతా 8వ పేజీలో

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

అన్నదాతలను అన్ని విధాలా ఆదుకోవడమే లక్ష్యం

- హోం మంత్రి వంగలపూడి అనిత
- ట్రాక్టర్లతో అన్నదాత సుఖీభవ సంఘీభావ ర్యాలీ

ఎస్.రాయవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిపాలన సాగిస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు సందర్భంగా మంగళవారం విజయోత్సవాన్ని



ర్యాలీలో భాగంగా ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న హోం మంత్రి అనిత, కూటమి నాయకులు



ఎస్.రాయవరంలో ట్రాక్టర్ల ర్యాలీ

నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.రాయవరం నుంచి వెంకటాపురం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర 70కిపైగా టాక్టర్లతో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం వెంకటాపురంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ రంగం ఆధునికీకరణకు, ప్రకృతి సేద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. పొలంలో విత్తనాలు చల్లడం, పంటలకు ఎరువులు వేయడం, పురుగు నివారణ మందులు పిచికారీ చేయడం కోసం రైతులకు రాయితీపై డ్రోన్లు అందిస్తున్నదని ... మిగతా 8వ పేజీలో

వర్షంతో ఊరట

పలు మండలాల్లో కుండపోతగా కురిసిన వాన

అనకాపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ మండి పోయింది. తరువాత వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమైంది. ఈదురు గాలులతో వర్షం మొదలైంది. కోటవురట్ల, పాయకరావుపేట, దేవరాపల్లి, గొలుగొండ మండలాలు, అనకాపల్లి పట్టణంలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, పొలాల్లో నీరు నిలిచింది. కాగా అనకాపల్లి, మాకవరపాలెం, నర్సీపట్నం, చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. సబ్బవరం, ఎలమంచిలి, పరవాడ, మునగపాక, అచ్యుతాపురం మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊరట చెందారు. వరినారుమళ్లకు, మెట్ట పంటలకు వర్షం ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు.



కోటవురట్లలో కురుస్తున్న వర్షం

రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

అనకాపల్లి అగ్రికల్చర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు తెలిపారు. మంగళవారం ఇక్కడ శాస్త్రవేత్తలతో జరిగిన వాతావరణ ఆధారిత సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వరి నారుమళ్లకు తామర పురుగు, పొడ పురుగు, గోధుమ రంగు మచ్చ తెగులు ఆశించే అవకాశం వుందని చెప్పారు. వీటి నివారణకు లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు, కార్బెండిజిం ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. వరినాట్లు వేసేటప్పుడు నారు ఆకు చివర్లను తుంచి, వరుసల మధ్య 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్ల దూరం వుండేలా కుదురుకు 2-3 మొక్కలు నాటుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మొక్కజొన్న పంటను ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నదని, ఉధృతినిబట్టి లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున మాంకోజెబ్‌ను కలిపి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. తొలి పూత దశలో ఉన్న వేరుశనగ పైరులో ఎకరాకు 200 కిలోల జిప్సం వేయాలని సూచించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరి, ఆర్.సరిత, రామలక్ష్మి, పద్మావతి, అలివేణి పాల్గొన్నారు.

పిడుగుపడి రైతు మృతి




పెద్దినాయుడు (ఫైల్)

నాతవరం, ఆగస్టు 12 ఆంధ్రజ్యోతి): పొలంలో పనులు చేస్తుండగా పిడుగు పడడంతో రైతు మృతిచెందాడు. నాతవరం గ్రామానికి చెందిన గవిరెడ్డి పెద్దినాయుడు (55) పొలంలో మంగళవారం వరినాట్లు వేస్తున్నారు. మహిళా కూలీలకు వరి కట్టలు అందిస్తుండగా ఆయనకు అతిసమీపంలో పిడుగుపడింది. దీంతో అక్కడక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు వున్నారు.

తాండవలో పెరుగుతున్న నీటినిల్వలు

- రిజర్వాయర్‌లోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



తాండవ రిజర్వాయర్

నాతవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ ఎగువున వున్న కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 372.6 అడుగులు వుంది. ఎగువ నుంచి గెడ్డల ద్వారా 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది.

ప్రస్తుతం తాండవలో ఉన్న నీరు ఆయకట్టుకు 75 రోజుల వరకు సరిపోతుందని, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం వున్నందున ఖరీఫ్ వరిసాగుకు నీటి ఎద్దడి వుండదని ప్రాజెక్టు డీఈఈ అనురాధ చెప్పారు.

గ్రంథాలయాలు నిర్వీర్యం

ఉమ్మడి జిల్లాలో 2/3 వంతు పోస్టులు ఖాళీ

- మొత్తం పోస్టులు 132.. ప్రస్తుతం ఉన్నది 44 మంది మాత్రమే!



నర్సీపట్నం శాఖా గ్రంథాలయం

నర్సీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రంథాలయాలకు సిబ్బంది కొరత తీవ్రంగా వుంది. మొత్తం పోస్టుల్లో 2/3 వంతు ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. దీనివల్ల గ్రంథాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధిక శాతం గ్రంథాలయాలు ఇన్‌చార్జిలతో నడుస్తున్నాయి. గ్రేడ్-1 గ్రంథాలయాల్లో కూడా అటెండర్లు, స్వీపర్లు నియామకాలు చేపట్టకపోవడంతో అన్ని పనులు గ్రంథాలయ అధికారే చేయాల్సి వస్తున్నది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రేడ్-1 గ్రంథాలయాలు ఆరు, గ్రేడ్-2 గ్రంథాలయాలు ఏడు, గ్రేడ్-3 గ్రంథాయాలు 41, గ్రామీణ గ్రంథాలయాలు మూడు ఉన్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు గ్రంథాయాలు తెరిచివుంచాలి. గ్రేడ్-1 గ్రంథాలయాలు నర్సీపట్నం, చోడవరం, ఎలమంచిలి, అనకాపల్లి, భీమిలి, విశాఖపట్నం(డీసీఎల్)లో ఉండగా నర్సీపట్నం, విశాఖపట్నంలో మాత్రమే గ్రంథాలయ అధికారులు ఉన్నారు. మిగిలిన చోట్ల ఇన్‌చార్జిలతో నడుస్తున్నాయి. గ్రేడ్-2 గ్రంథాలయాల్లో ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్-3 గ్రంథాయాలు 41 ఉండగా వీటిల్లో 21 మంది మాత్రమే లైబ్రేరియన్లు ఉన్నారు. మిగిలిన 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రెండేసి గ్రంథాలయాలకు ఒక అధికారి పని చేయాల్సి వస్తున్నది. గొలుగొండ గ్రంథాలయ అధికారి ఎస్.వరలక్ష్మి ప్రతి బుధవారం నాతవరంలో విధులు నిర్వహిస్తున్నారు. రోలుగుంట గ్రంథాలయ అధికారి రాజుబాబు ప్రతి బుధవారం కొయ్యూరులో పనిచేస్తున్నారు. ఆర్.అప్పలనాయుడు మూడు రోజులు కోటవురట్ల, మరో మూడు రోజులు పాములవాకలో విధులు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో అధికారి, అటెండరు, స్వీపర్ కమ్ వాచ్‌మన్ ఉండాలి. కానీ గ్రంథాలయ అధికారి మాత్రమే ఉన్నారు. దీంతో అన్ని రకాల పనులు గ్రంథాలయ అధికారి దమయంతి ఒక్కరే చూసుకోవాల్సి వస్తున్నది.

దిగువస్థాయి సిబ్బంది కొరత

ఉమ్మడి విశాఖ జిల్లాలో 132 పోస్టులకుగాను ప్రస్తుతం 44 మంది మాత్రమే వున్నారు. ఇంతకు రెట్టింపు.. అంటే 88 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో ఇద్దరికిగాను ఒక్కరే ఉన్నారు. టైపిస్టు పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. రికార్డు అసిస్టెంట్లు 17 మందికిగాను పది మంది వున్నారు. ఆఫీస్ సబార్డినేట్‌లు 38 మందికిగాను ఆరుగురే ఉన్నారు. వాచ్‌మన్ కమ్ స్వీపరు పోస్టులు 16కి ఇద్దరు మాత్రమే ఉన్నారు.

నేడు ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక



ఎస్. రాయవరం మండల పరిషత్ కార్యాలయం

ఎస్.రాయవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. రెండు నెలల క్రితం ఎంపీపీ వెంకటలక్ష్మి వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేయడంతో తరువాత వైస్ ఎంపీపీగా ఉన్న బొలిశెట్టి గోవిందరావును తాత్కాలిక ఎంపీపీగా నియమించారు. కొద్ది రోజుల క్రితం ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయడంతో తాత్కాలిక ఎంపీపీగా ఉన్న గోవిందరావు ఎన్నికకు ఎవరూ హాజరుకాకుండా చేసి వాయిదా పడేలా చేశారు. అయితే తాత్కాలిక ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు వైసీపీకి రాజీనామా చేసి తాత్కాలిక ఎంపీపీ పదవిలో మాత్రమే కొనసాగుతున్నారు. అయితే ఎన్నికల కమిషన్ మళ్లీ ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో గోవిందరావు వైసీపీకి మరొక షాక్ ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులుండగా.. అందులో 15 మంది వైసీపీకి చెందిన వారు. అయితే వీరిలో కొంతమంది గోవిందరావు చెబితే వినే వాళ్లు ఉండడంతో వైసీపీకి ఎంపీపీ పదవి దక్కకుండా చేయాలని వ్యూహం రచించారని చెబుతున్నారు. ఎంపీపీ పదవికి తానే ఒకరిని పోటీ చేయించి తన ఇమేజ్‌తో ఇండిపెండెంట్‌గా గెలిపించుకోవాలని బొలిశెట్టి భావిస్తున్నట్టు సమాచారం. ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.

పైడమ్మ చెరువును డిఫెన్స్‌కు అప్పగించొద్దు

ఎమ్మెల్యే విజయకుమార్‌కు వాడనర్సాపురం గ్రామస్థుల వినతి



ఎమ్మెల్యే విజయకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వాడనర్సాపురం గ్రామస్థులు

రాంబిల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురంలో పైడమ్మ చెరువును డిఫెన్స్(ఎన్ఏఓబీ)కి అప్పగించొద్దని వాడనర్సాపురం గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గ్రామానికి చెందిన పెద్దలు అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి సుందరపు విజయకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైడమ్మ చెరువులో చేపల వేట సాగిస్తూ, వాటిని విక్రయించుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. ఏడు గ్రామాల పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. వరద ముంపు నుంచి పది గ్రామాలను ఈ చెరువు కాపాడుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా రెవెన్యూ అధికారులు ఈ చెరువును డిఫెన్స్ వారికి అప్పగించడంతో వారు చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి భూమి పూజ చేశారన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా చెరువును ఎలా అప్పగిస్తారని వారు ప్రశ్నించారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే విజయకుమార్ జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని గ్రామ సర్పంచ్ కారే రామారావు, బీజేపీ మండల అధ్యక్షులు కారే రాముడు, మత్స్యకార నేతలు సూరాడ ప్రసాద్, నాని, తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, పలువురు మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

మురుగు నీటిలో కంటోన్మెంట్

» వర్షం వస్తే రోడ్డపైకి చేరుతున్నడ్రైనేజీ నీరు.. » ఇబ్బంది పడిన ప్రజలు

పాయకరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కంటోన్మెంట్ ఏరియాలో చిన్నపాటి వర్షం పడినా కాలువల్లో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. మంగళవారం పడిన భారీ వర్షానికి కంటోన్మెంట్ ఏరియాలోని రోడ్లపైకి మురుగు నీరు చేరి చెరువులను తలపించాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న కంటోన్మెంట్ ఏరియాలోని పంచాయతీ కాలువల్లోని మురికినీరంతా పెద్ద కాలువ ద్వారా నేరెళ్ల కాలువలోకి చేరుతుంది. అయితే మూడేళ్లుగా నేరెళ్ల కాలువలో పూడిక, చెత్త తొలగించలేదు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద కాలువలను షాపుల యజమానులు సిమెంట్ పలకలతో మూసివేయడంతో శుభ్రం చేయడానికి వీలులేకుండా పోయింది. దీంతో కాలువలు పూడిక, చెత్తతో నిండిపోయాయి. వీటికి అనుసంధానంగా ఉన్న వీధికాలువల్లోని మురికినీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి పారిశుధ్యం అధ్వానంగా మారుతోంది. ముఖ్యంగా కంటోన్మెంట్ ఏరియాలో ఉన్న కాలువల్లోని మురికినీరు ఎక్కడికక్కడ పేరుకుపోయి అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం సాయంత్రం పడిన భారీ వర్షానికి ఈ ప్రాంతంలోని వీధులు మురికినీటి చెరువులను తలపించాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కంటోన్మెంట్ ఏరియాలో రోడ్డుపైకి చేరిన మురికినీరు

పలుచోట్ల ఇళ్లలోకి మురికినీరు చేరింది. వర్షం తగ్గిన తర్వాత ఆ నీటిని బయటకు తోడుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద కాలువల్లోని పూడిక, చెత్తను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వరి నారుమడులకు అగ్గి, పొడ తెగుళ్లు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ సుమంత

» వ్యవసాయ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం

మునగపాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అధిక శాతం వరి నారుమడులు అగ్గి, పొడ తెగుళ్ల ఆశించాయని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో నాగులాపల్లి, మునగపాకల్లో మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. నాగులాపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ వరి నారుమడుల్లో పొడతెగులు నివారణకు హెక్సాకోనజోల్, అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. అనంతరం మునగపాకలో ఉన్న పలు ప్రైవేటు ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. వారు విక్రయిస్తున్న ఎరువులు, పురుగు మందులు గురించి ఆరా తీశారు. వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాగులాపల్లి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యల్లపు వెంకటభాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

కొబ్బరి తోటల్లో అంతర పంటలు సాగు చేసుకోవడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చునని మండల వ్యవసాయాధికారిని సి.సుమంత తెలిపారు. మండలంలోని రాంబిల్లి, కొప్పుగొండుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కొబ్బరి తోటల మధ్య పచ్చిరొట్ట నిచ్చే జీలుగ, జనుము, మొక్కజొన్న, నువ్వు వంటి పంటలు సాగు చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం వస్తుందన్నారు. జీవన ఎరువులు అయిన అజటోబాక్టర్, రైజోబియం, ఫాస్ఫరస్, పొటాష్ కరిగించేవి వాడడం ద్వారా వలన భూసారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ కోటేశ్వరరావు, వీహెచ్ఏ అనిల్, రైతులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

పాయకరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట ప్రజలపై నెల రోజుల తర్వాత వరుణుడు కరుణించాడు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. సుమారు గంటపాటు పడిన వర్షానికి పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. పనులపై బయటకు వచ్చినవారు తడిసి ముద్దయ్యారు. గత నెల రోజులుగా అడపా దడపా ఆకాశం మేఘాలు కమ్మినా వర్షం పడకపోగా.. పగటి వాతావరణం ఎండకాలాన్ని తలపించింది. రాత్రి పూట ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు మంగళవారం సాయంత్రం పడిన వర్షానికి వాతావరణం పూర్తిగా చల్లబడడంతో సేదదీరారు,

కోటవురట్లలో..

అల్పపీడనం ప్రభావం కారణంగా మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో మండలంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న సమయంలో మధ్యాహ్నం గంటన్నరపాటు వర్షం కురిసింది. మండలంలో తంగేడు, జల్లూరు, టీకేపల్లి లింగాపురం కైలాసపట్నం రాజుపేట, సుంకపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వర్షానికి పొలాల్లో నీరు చేరింది. ఈ వర్షానికి రైతులు వరి దమ్ములు పట్టే అవకాశం ఉంది.



పాయకరావుపేటలో పడుతున్న వర్షం

ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నిర్మూలిద్దాం

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ఎస్.రాయవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నిర్మూలిద్దామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మండలంలోని లింగరాజుపాలెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు పట్టుదలతో కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి కలెక్టర్ పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు, డీఎంహెచ్‌వో ఎం. హైమావతి, జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, తహశీల్దార్ రమేష్‌బాబు, సర్పంచ్ ఉదయకుమారి, హెచ్ఎం గీత, సర్వసిద్ధి వైద్యాధికారులు పాల్గొన్నారు.

మునగపాకలో..

నులిపురుగులు నిర్మూలన లక్ష్యంగా 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నామని ఎన్‌డీడీ రాష్ట్ర పరిశీలకురాలు శాంతి సౌందర్య తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా మంగళవారం ఆమె మండలంలో పర్యటించారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాట్లు గురించి తెలుసుకున్నారు. మునగపాక అంగన్‌వాడీ కేంద్రం, పాటిపల్లిలో కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని సందర్శించి కార్యక్రమాన్ని పరిశీలించారు. మునగపాక పీహెచ్‌సీ పరిధిలో 6,778 మందికిగాను 6,500 మందికి అందజేశామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎస్.విమలగిరి తెలిపారు. చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలో 1,726 మంది విద్యార్థులకు గాను 1,633 మందికి వేయడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఆర్.దేవకాంత, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

మండలంలోని పేట బయ్యవరం ఎంపీపీ స్కూలు విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలను రేగుపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హెచ్ఎం. ధనలక్ష్మి, ఉపాధ్యాయులు బొడ్డేడ సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరభద్రరావు, నీరజా కన్యాకుమారి, వైద్య సిబ్బంది ఎస్‌కె.దేవి, ఆశకార్యకర్త బి. బేబీ, ఏ, గోపమ్మ పాల్గొన్నారు.



లింగరాజుపాలెం హైస్కూల్‌లో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర తీస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లిలో.

మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నక్కపల్లి గర్ల్స్ హైస్కూల్‌లో ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఎంఈవో కె.నరేశ్ పర్యవేక్షణలో బాలికలకు ఈ మాత్రలు అందజేశారు. పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్ఎం జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు, కుమారి, పద్మావతి పర్యవేక్షణలో తరగతి గదుల్లో విద్యార్థులతో నులిపురుగుల నివారణకు మాత్రలను అందజేశారు.

పాయకరావుపేటలో..

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 14,581 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వీఎస్.సౌందర్య తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.



మునగపాక అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌డీడీ రాష్ట్ర పరిశీలకురాలు శాంతి సౌందర్య

కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ డి.నెహ్రూ, హెచ్ఎస్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోటవురట్లలో

మండలంలో 5,129 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు కే వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ ప్రత్యూష తెలిపారు. మంగళవారం ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ కార్యక్రమాన్ని కోటవురట్ల, యండపల్లి గ్రామాల్లో ఇద్దరు డాక్టర్లు పర్యవేక్షించారు. కొడవటిపూడి జడ్పీ హైస్కూల్‌లో గ్రామసర్పంచ్ కోసూరి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు యలమంచిలి ప్రకాష్, విద్యాకమిటీ ఛైర్మన్ యలమంచిలి శ్రీను విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయించారు. పాఠశాల హెచ్ఎం ఆర్. ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

జాతీయ నులుపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు నులుపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీహెచ్‌సీల వైద్యులు కె. అనిల్‌కుమార్,ఆర్.వెంకటేష్, సీహెచ్ దీపిక, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎలమంచిలి: పేట బయ్యవరం పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్ర పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



నక్కపల్లి పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు



పాయకరావుపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి నులిపురుగుల మాత్ర వేస్తున్న డాక్టర్ వీఎస్.సౌందర్య

దేశభక్తి పెంపొందించేందుకే తిరంగా ర్యాలీలు

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు



తిరంగ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తి పెంపొందించాలనే లక్ష్యంతో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలో బీజేపీ నేతలు పరమేశ్వరావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, స్థానిక బీజేపీ నేతలు, విద్యార్థులు పాత సినిమాహాలు జంక్షన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతీ ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటుదామన్నారు. స్వదేశీ వస్తువులనే వాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఛైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ పంద్రాగస్టుకు ప్రతీ ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు బొద్దపు శివ, అగ్రహారపు కుమారస్వామి, బీజేపీ నేతలు ఆడారి శ్రీధర్, సుందరపు బాబ్జీ, పప్పు ఈశ్వరరావు, పిట్టా దాసుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ఎలమంచిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు శక్తి యాప్‌పై రూరల్ ఎస్ఐ ఉపేంద్ర అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని రేగుపాలెం, పులపర్తి జెడ్పీ హైస్కూల్, కొక్కిరాపల్లి డా.బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ స్క్రీన్‌పై పోక్సో చట్టం, బాల్య వివాహాలు, శక్తి యాప్ డౌన్‌లోడ్ గురించి ఎస్ఐ ఉపేంద్ర వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

ఎలమంచిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి డివిజన్ పరిధిలో ఆర్‌డీఎస్ పనుల్లో భాగంగా ఈనెల 14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎలమంచిలి పట్టణం(ఏజీఎల్), కొత్త ఎర్రవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం (ఏజీఎల్), పెదషేకిళ్లపాలెం, చిన్న షేకిళ్లపాలెం, కొక్కిరాపల్లి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

మన డబ్బులు-మన లెక్కలు పక్కాగా నిర్వహించాలి

» డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

మునగపాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలు 2.0 కార్యక్రమంలో భాగంగా మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి పిలుపునిచ్చారు. మండలంలో ఒంపోలులో మంగళవారం డ్వాక్రా సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి, రికార్డులను నిర్వహించాలన్నారు. పొదుపు, అప్పు తదితర లావాదేవీలు సమాచారం మహిళా సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలన్నారు. కొత్త వ్యాపారాల ద్వారా మహిళలు జీవనోపాధి పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం బాలరాజు, సీపీ రామకృష్ణ, వేణు, వీవోఏ చిన్నమ్మలు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు మనోధైర్యం కోల్పోలేదు

» వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

మునగపాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఓటమి చెందినా వైసీపీ శ్రేణులు మనోధైర్యాన్ని కోల్పోలేదని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో గొల్లలపాలెం, మల్లవరం, నాగవరం గ్రామాల్లో బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మునగపాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.ప్రసాదరావు అన్నారు. మండలంలో అరబుపాలెంలో మంగళవారం ఆయన పర్యటించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో ముందడుగు

» ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఐరన్ గడ్డర్లు ఏర్పాట్లు



ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కోసం ఐరన్ గడ్డర్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

ఎలమంచిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో మరో అడుగు ముందుకు పడింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఒకటి, రెండు ప్లాట్ ఫారాలను కలుపుతూ నిర్మిస్తున్న రెండో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో గురువారం ఇనుప గడ్డర్‌లు ఏర్పాటు చేశారు. భారీ హైడ్రాలిక్ క్రేన్ సాయంతో సుమారు రెండు గంటల్లో పనులు పూర్తిచేశారు. హైటెన్షన్ విద్యుత్ లైన్లు వుండడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎలమంచిలి స్టేషన్ మీదుగా పాసింజర్ రైళ్ల రాకపోకలు సాగించని సమయంలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి పనులు చేపట్టినట్టు రైల్వే అధికారులు తెలిపారు.



కశింకోటలో బాలికలకు నులి పురుగుల నివారణ మందు వేస్తున్న డాక్టర్

నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నిర్మూలన దినంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటి నుంచి 19 ఏళ్ల గల వారికి వయసును బట్టి మాత్రలను మింగించడం, చప్పరించే విధంగా చర్యలు చేపట్టారు.

కశింకోటలో...

కశింకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు నులి పురుగుల నివారణ మందును మింగించామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 10446 మందికి ఈ మందులు అందించినట్టు చెప్పారు. ఆహారం తీసుకునేటప్పుడు పరిశుభ్రతను పాటించాలని, చేతులను సబ్బుతో కడుక్కోవాలని ఆయన సూచించారు. అలాగే తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విద్యార్థులకు వైద్యులు డాక్టర్ ఏ.మనీషా, డాక్టర్ ఎస్.సుమ ఈ మందు మింగించారు. పీహెచ్‌సీ పరిధిలో 6,842 మందితో మాత్రలు వేయించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.జ్యోతి, సర్పంచ్ ఎం.జయరజిని, హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, హెచ్ఎం ఎస్.ప్రసాదరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ: వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలోజుట పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థులందరికీ వైద్యాధికారి కనక అప్పారావు పర్యవేక్షణలో సిబ్బంది మాత్రలు అందజేశారు. మొత్తం 4,186 మంది విద్యార్థులకుగాను 4,102 మందికిట మాత్రలు అందజేశారు. మిగిలిన వారికి ఈ నెల 20న అందజేస్తామని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు ఫాతిమా బేగం, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం: స్థానిక గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివప్రసాద్‌నారాయణ మాట్లాడుతూ.. 94 శాతం మందికి మంగళవారం మాత్రలు పంపిణీ చేసినట్టు చెప్పారు. మిగతా విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి మాత్రలు ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ ప్రధాన వైద్యలు డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ 9,962 మంది లక్ష్యం కాగా, 9,363 మందికి మాత్రలు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో డాక్టర్ స్వర్ణలత, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారన్నారు.

జాతీయ ప్రతిభా పురస్కార గ్రహీత యండకుర్తి అప్పలరాజుకు ఎమ్మెల్యే సత్కారం



గాయకుడు యండకుర్తి అప్పలరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కొత్తూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏలూరులో జరిగిన సింగర్ ఫెస్ట్-2025లో అనకాపల్లికి చెందిన స్వర్ణకారుడు యండకుర్తి అప్పలరాజు జాతీయ ప్రతిభా అవార్డు పొందారు. అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కళావేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 151వ ఈవెంట్‌లో గాయకుడు అప్పలరాజు పాల్గొని ప్రతిభ కనబరచడం ఆనందదాయకమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా అప్పలరాజుకు మంగళవారం అనకాపల్లి పట్టణం రింగురోడ్డులోని జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర శాలువా కప్పి సత్కరించారు.

ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికుల ధర్నా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఎన్ఎంయూఏ కార్మికులు మంగళవారం అనకాపల్లి ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ అయిపోయి రెండేళ్లు పూర్తయినందున ఐఆర్ ప్రకటించాలని, గవర్నర్‌పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లూలూ సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉప సంహరించుకోవాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో తరలించడాన్ని ఆపాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని తదితర డిమాండ్లతో యూనియన్ నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాలో యూనియన్ డిపో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల మెరుగుకు కృషి

▸▸ జిల్లా పంచాయతీ వనరుల సమన్వయకర్త నాగలక్ష్మి

కశింకోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద కేంద్రాలు మెరుగు కృషి చేయాలని జిల్లా పంచాయతీ వనరుల సమన్వయకర్త నాగలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం బయ్యవరం, తేగాడ, పేరంటాలపాలెం, బుచ్చెయ్యపేట గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కేంద్రాల పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. బయ్యవరం, తేగాడ గ్రామాల్లో సంపద కేంద్రాలను తక్షణమే మెరుగుపరచకుంటే చర్యలు తీసుకుంటానని పంచాయతీ కార్యదర్శి దిలీప్‌ను హెచ్చరించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో తమ్మిన వెంకట తేటారావు తదితరులు ఉన్నారు.

పగిలిన అమ్మోనియా ద్రావణం డ్రమ్ము

▸▸ 50 లీటర్ల మేర ద్రావణం నేల పాలు

▸▸ శ్రీభార్గవి అమ్మోనియా పరిశ్రమలో ఘటన



అమ్మోనియా అండ్ కెమికల్స్ కంపెనీ ఇదే..

పరవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండస్ట్రియల్ పార్కులోని భార్గవి అమ్మోనియా అండ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం అమ్మోనియా ద్రావణంతో ఉన్న డ్రమ్ము పగిలిపోయింది. దీంతో 50 లీటర్ల మేర ద్రావణం నేలపాలైంది. దీని కారణంగా భరించలేని దుర్వాసన వెదజల్లింది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీభార్గవి అమ్మోనియా అండ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ద్రావణం అమ్మోనియాను ఆటోమేటిక్ ఫిల్లింగ్ మిషన్ ద్వారా నింపి, అనంతరం కింద ఉన్న మెయిన్ మిషన్ ద్వారా వరుస క్రమంలో చేరుస్తున్నారు. ఈ క్రమంలో అమ్మోనియా ద్రావణం డ్రమ్ములో నింపి వెయింగ్ మిషన్ వద్ద దించుతుండగా ప్రమాదవశాత్తూ కిందకు పడిపోయింది. దీంతో సుమారు 50 లీటర్ల ద్రావణం అమ్మోనియా నేలపాలైంది. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు బొద్దపు చిన్నారావు, చందక కృష్ణ, రమేశ్ డిమాండ్ చేశారు.

శిథిలావస్థలో రక్షిత నీటి పథకం

ఇరువాడ ఎస్సీ/బీసీ కాలనీలో తాగునీటి సమస్య

చాలీచాలని నీటితో కాలనీ వాసుల ఇబ్బందులు



ఇరువాడ ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన రక్షిత నీటి పథకం

సబ్బవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువాడ ఎస్సీ/బీసీ కాలనీలో రక్షిత నీటి పథకం శిథిలావస్థకు చేరింది. పిల్లర్లు బీటలు వారడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఎస్సీ కాలనీలో అప్పుడు ఉన్న జనాభా అవసరాల మేరకు ఇరువాడ గ్రామ సమీపంలో పంప్ ఏర్పాటు చేసి, కాలనీలో ట్యాంక్ నిర్మించారు. అప్పటి నుంచి ప్రజలు అదే మంచినీటి పథకం నీటిని వినియోగిస్తున్నారు. అయితే రక్షిత నీటి పథకం నిర్మించి 25 ఏళ్లు కావస్తుండడంతో శిథిలావస్థకు చేరింది. పంప్ హౌస్ నుంచి ట్యాంక్‌కు వచ్చే పైపులు కూడా పలు చోట్ల లీకులు ఏర్పడడంతో కాలనీ వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 25 ఏళ్ల క్రితం అప్పటి జనాభా అవసరాల మేరకు మంచినీటి పథకం ఏర్పాటు చేసారని, రెండు దశాబ్దాలు దాటడంతో ప్రస్తుతం కాలనీలో జనాభా పెరగడంతో ట్యాంక్ సామర్థ్యం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకు వెళ్లామని, సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. శిథిలావస్థకు చేరిన మంచినీటి పథకం స్థానంలో, కొత్తగా నిర్మించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను కాలనీ వాసులు కోరుతున్నారు. గత నెలలో రెండు కాలనీల మహిళలు తాగునీటి సమస్యపై నిరసన తెలిపారు. అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు చెబుతున్నారు.

స్త్రీశక్తి పథకాన్ని విజయవంతం చేయండి

డ్రైవర్ల సమావేశంలో జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ప్రవీణ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీటీవో ప్రవీణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వి.ప్రవీణ సూచించారు. డిపో గ్యారేజిలో డ్రైవర్లతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. అందువల్ల డ్రైవర్లు విధులకు హాజరయ్యేటప్పుడు కుటుంబసభ్యులను దృష్టిలో పెట్టుకుని, వారిలాగే బస్సులో ప్రయాణికులను చూసుకుంటూ గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. బస్సుల్లో ఏమైనా లోపాలు ఉంటే మీ దృష్టికి తీసుకువారాలని స్పష్టం చేశారు. ఏకాగ్రతతో బస్సులను నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ పథకం అమల్లోకి తీసుకురానున్నందున రోజు వారీ ప్రయాణికుల కంటే బస్సుల్లో అధిక శాతం ప్రయాణికులు ఎక్కే అవకాశం ఉన్నందున, ఎటువంటి అసహనానికి గురికాకుండా బాధ్యతగా ప్రయాణికులను వారి కోరిన చోట చేర్చేలా చూడాలని ఆమె కోరారు. మహిళలు బస్సు ఎక్కిన తరువాత ఆధార్ కార్డు చూపుతారని, కండక్టర్ జీరో టికెట్ ఇస్తారని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. డ్రైవర్లు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఎఫ్ పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఘాట్‌లో పక్కా ఏర్పాట్లు

▸▸ జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి



వినాయక నిమజ్జన ఘాట్‌ను పరిశీలిస్తున్న జడ్సీ, నిమజ్జనోత్సవ కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శారదానది ఒడ్డున గల వినాయక నిమజ్జన ఘాట్ వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తామని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం నిమజ్జనోత్సవ కమిటీ ప్రతినిధులతో ఆయన వినాయక నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ మరో పక్షం రోజుల్లో వినాయక చవితి వేడుకలు ప్రారంభం కావడంతో పాటు వినాయక నిమజ్జనాలన్నీ శారదానదిలో చేసే ఆనవాయితీ ఉన్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ వస్తువులు ఉంటే ఒక డ్రమ్ము ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చి ఘాట్ అంతా పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. వినాయక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఎ.కుమారస్వామి మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి ఘాట్‌కు 20 వేల మంది వరకు భక్తులు హాజరవుతారని వివరించారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు ఆరో తేదీ వరకు గణపతి నిమజ్జనాలు జరుగుతాయన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు.

అనకాపల్లిలో జడ్సీ విస్తృత పర్యటన

అనకాపల్లి పట్టణంలో మంగళవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులతో విస్తృతంగా పర్యటించారు. గవరపాలెంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంను పరిశీలించి క్రీడాకారులకు స్టేడియం అందుబాటులోకి వచ్చేలా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే అన్న క్యాంటీన్లు పరిశీలించారు. కొత్తూరు పంచాయతీ పరిధిలోని సాయినగర్‌లో నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రేరీని పరిశీలించి పనులు త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆయన గాంధీనగరంలో పర్యటించారు. నీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టారు. ఆయన వెంట ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ శేఖర్, డీఈ వేణుగోపాలరావు, శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడండి

తుమ్మపాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జోనల్ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై దరాభారాన్ని మోపి పన్నుల రూపంలో వసూళ్లు చేసి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు పెచ్చురిల్లిపోతున్నాయన్నారు. అలాగే రాష్ట్రంలో అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం, సర్దుబాటు చార్జీల పేరుతో పెనుభారం మోపిందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కార్పొరేట్ రంగానికి భుజం కాస్తూ పేద ప్రజలపై పలు భారాలను ప్రభుత్వాలు మోపుతున్నాయన్నారు. రైతులకు సాగునీటిని అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వైఎస్ భద్రం, శ్రీరామదాసు, అబ్బులు, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు డీఎస్ మూర్తి, కరణం మాణిక్యాలరావు, పెంటకోట ప్రసాద్, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

▸▸ పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు

పరవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. ముత్యాలమ్మపాలెం హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎక్కడైనా విక్రయించినట్టు తమ దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. విద్యార్థులంతా క్రమశిక్షణను అలవర్చుకొని మంచి ప్రయోజకులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఎస్ఐ మహాలక్ష్మి, హెచ్ఎం ఎన్.అప్పలరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎస్ఎన్ రెడ్డి, డి. సత్యనారాయణ, మహిళా పోలీస్ శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎ.సిరసపల్లి ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ నిలిపివేయాలని ఎమ్మెల్యేకు వినతి

సబ్బవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.సిరసపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని బంగారమ్మపాలెం, అడ్డూరు సిరసపల్లి(ఏ సిరసపల్లి) గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల రైతులు మాట్లాడుతూ ఈ నెల 7న రెవెన్యూ అధికారులు తమ గ్రామంలో గ్రామసభ నిర్వహించి లేండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటున్నట్టు చెప్పారన్నారు. ఎ.సిరసపల్లి గ్రామంలో తరతరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ, ఇరు గ్రామాలకు చెందిన సుమారు 250 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నామన్నారు. సదరు భూముల్లో కొబ్బరి, మామిడి, జీడి మామిడి, పశు పోషణ జీవనంగా జీవిస్తున్నామన్నారు. తమకు ఆ భూములు తప్ప వేరే ఎటువంటి అధారం లేదన్నారు. రెండు గ్రామాల రైతులు సమావేశమై జీవనాధారమైన భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ తీర్మానం చేశారు. ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని కోరారు.

భారీ వర్షం



అనకాపల్లిలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చినుకులతో మొదలైన వర్షం సుమారు గంట సేపు వర్షం భారీగా కురిసింది. దీంతో రహదారులన్నీ తడిసి ముద్దయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వాహనాలు లక్ష్మీదేవిపేట రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించాయి. రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. ఇటీవల ఇంత భారీ వర్షం కురియడం ఇదే మొదటిసారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మరిడిమాంబ సారె ఊరేగింపు



అమ్మవారి సారెను ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి పండుగలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహించారు. ఆలయ చుట్టుపక్కల వీధుల్లో ఉంటున్న మహిళలు ఇళ్ల వద్ద తయారుచేసిన వివిధ రకాల పిండి వంటలు, మిఠాయిలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారి ముందు పెట్టి పూజలు చేశారు. అనంతరం మిఠాయిలను ఇళ్లకు తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు, బంధువులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కోట్ని పూర్ణచంద్రరావు హరినాథ్, తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని రామకృష్ణ, కోట్ని అయ్యన్నదొర, కోట్ని రాంబాబు పాల్గొన్నారు.

మల్లునాయుడుపాలెంలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్త దానం చేస్తున్న దృశ్యం

సబ్బవరం: మల్లునాయుడుపాలెం గ్రామంలో సింగంపల్లి సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 60 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ గండి దేముడు, సభ్యులు బి.గంగునాయుడు, గండి శ్రీను, బాష్యరావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తెమ్మతల్లి పండుగ



సత్తెమ్మతల్లి అమ్మవారు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక దాసరిగెడ్డ రోడ్డులో ప్రసిద్ధి చెందిన సత్తెమ్మతల్లి పండుగ బుధవారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రావణ మాసంలో జరిగే ఈ పండుగ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్లన్నీ విద్యుత్ అలంకరణ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఆరు గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం నేలవేషాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రికి ఆలయ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కన్వీనర్ బి.మోహనరావు తెలిపారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

కశింకోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చెర్ల గ్రామంలో పాడి రైతులకు మంగళవారం రాయితీపై పశుదాణా అందజేశారు. వేసవిలో ఎండుగడ్డి కొరత ఏర్పడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం 50 శాతం రాయితీపై సమీకృత మిశ్రమ దాణాను అందజేస్తోంది. సచివాలయం ప్రాంగణంలో రైతులకు 50 కిలోల బస్తాను అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, జాన్, శ్రీను, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామగ్రి చోరీ

కొత్తూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని వెంకుపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సామగ్రిని అపహరించుకుపోయారని సీడీపీవో పి.ప్రభావతి రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేంద్రంలో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు, స్మార్ట్ టీవీ, ఐదు లీటర్ల స్టీలు కుక్కరు, మూతలతో ఉన్న మూడు గిన్నెలు చోరీ జరిగినట్టు తెలిపారు. నిందితులను పట్టుకొని తమ సామగ్రి రికవరీ చేయడమే కాకుండా దొంగతనాలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని భారత దేశంలోనే మొట్ట మొదటి విద్యార్థి సంఘంగా ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ 90 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఆనందకరమని ఈ సందర్భంగా బాబ్జి అన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని పేర్కొన్నారు. గతంలో చేసిన పోరాటాలు, సాధించిన విజయాలపై చర్చించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్లను బిగించాలనే యోచన విరమించుకోవాలని కోరారు. బిల్లు రశీదులు ప్రింట్ సక్రమంగా లేకపోవడం వల్ల ఫైల్ చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందని వివరించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఒత్తిడి చేసి బిగించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్యబాబు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి

కశింకోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి రిటైర్డ్ లైబ్రరియన్లు జి.మురళీకృష్ణ, ఆర్.కన్నబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జగన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిడిమాంబ పండుగ పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం మరిడిమాంబ ఆలయంలో ఈ నెల 14న జరిగే అమ్మవారి పండుగ పోస్టర్‌ను కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. ప్రతి ఏడాది మాదిరిగానే పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో కేఎం.నాయుడు, కె.కిశోర్ పాల్గొన్నారు.

హైవేలో ప్రమాదాలపై అవగాహన

కశింకోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కశింకోట కూడలి వద్ద ప్రమాదాలపై వాహనచోదకులు, ప్రయాణికులకు సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు మంగళవారం అవగాహన కల్పించారు. అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కాకూడదన్నారు. అనంతరం అతి వేగంగా ప్రయాణించే వాహనాలను ఆపి జరిమానా విధించారు. జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

కోర్టుల్లో మౌలిక సదుపాయాల సమాచారం ఇవ్వాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి కోర్టుల సముదాయంలో కక్షిదారులు, వృద్ధులు, దివ్యాంగులకు, సహాయకులకు కల్పిస్తున్న కనీస వసతుల సమాచారాన్ని అందజేయాలని అనకాపల్లి పదో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆర్టీఐ చట్టం ప్రజా సమాచార అధికారి, సీనియర్ సూపరింటెండెంట్‌కు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆదేశాలు జారీ చేశారని ఆర్టీఐ ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. ఇది జరిగి నెల రోజులు దాటినా స్పందించలేదన్నారు. దీంతో మంగళవారం హైకోర్టుకు చేసిన ఫిర్యాదు వివరాలను విలేకరులకు వివరించారు. అనకాపల్లి కోర్టుల స్థిర, చరాస్తులు, సేవలు, లీగల్ సర్వీసెస్ అథారిటీ, లబ్ధిదారుల జాబితా, కోర్టుల వివరాలు తదితర 21 అంశాల సమాచారం కోసం ఏప్రిల్ 28వ తేదీన దరఖాస్తు చేసినట్టు ఆయన తెలిపారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



మేకలు, గొర్రెలకు టీకాలు వేస్తున్న కాశీపట్నం వైద్యాధికారి గణేశ్వరరావు, సిబ్బంది

అనంతగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీంపోల్ పంచాయతీ నందకోట, గొంద్రంగిపాడు, బి.కొత్తకోట, లువ్వా, గుడ్డిమామిడివలస గ్రామాల్లో మంగళవారం కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. 510 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ టీకాలు, 426 మేకలు, గొర్రెలకు పారుడు వ్యాధి నిరోధక టీకాలను వేసినట్టు ఆయన చెప్పారు. అనంతరం భీంపోల్ సచివాలయం వద్ద పశుసంపదపై ఆధారపడిన రైతులకు అవగాహన కల్పించారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా తక్కువవడ్డీతో బ్యాంక్ రుణాలు, పశుబీమా, జాతీయ ఉపాధిహామీ పథకంలో పశువుల శాలలు నిర్మాణానికి చర్యలు చేపడునట్టు, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాల ని పిలుపునిచ్చారు. సర్పంచి భీమ్మలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అశోక్, జూనియర్ వెటర్నరీ అధికారి జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె. సుధ తెలిపారు. బీఏ(ఎకనామిక్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (ఫిజిక్స్), బీఎస్సీ (జువాలజీ), బీఎస్సీ(మ్యాథ్స్) కోర్సులకు ఒక్కోదానిలో 40 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కళాశాలకు అనుసంధానంగా హాస్టల్ వసతి, అనుభవజ్ఞులైన ఉపన్యాసకులచే విద్యాభ్యాసం ఉంటుందన్నారు. ఆసక్తి గల ఇంటర్ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థినులు ప్రవేశం కోసం కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



ఉరిసింగిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం పంచాయతీ ఉరిసింగి గ్రామంలో రూ.10 లక్షల జడ్పీ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. మంగళవారం ఉరిసింగిలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి ఎంపీపీ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జడ్పీ, మండల పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా తాగునీటి పథకాలు, సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. చింతపల్లి లో ఎంపీ గుమ్మ తనుజారాణి నిధులు రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపీనాయక్ శారద, సర్పంచ్ వనగల సోమరత్నం, ఏఈఈ స్వర్ణలత, వైసీపీ నాయకులు బెన్నిబాబు, జల్లి సుధాకర్, బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ వరప్రసాద్, పోలీసులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెంట్ ధరించాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రమాదాల నియంత్రణ కోసం పోలీసుశాఖ ముద్రించిన పోస్టర్లను సీఐ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో జరిగిన ద్విచక్రవాహనాల రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించక అత్యధిక సంఖ్యలో ప్రజలు చనిపోతున్నారన్నారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనాలను నడుపుతున్నారన్నారు. అలాగే డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తులకు లైసెన్సు, వాహనాలకు ఇన్సురెన్సులేకపోవడంతో బాధితులకు పరిహారం అందడంలేదన్నారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో భాగంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాహనచోదకులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

హుకుంపేట ఆగస్టు 12 ఆంధ్రజ్యోతి: మండల పరిపరిషత్ ఉపాధ్యక్ష పదవికి బుధవారం ఎన్నిక జరుగుతుందని స్థానిక ఎంపీడీవో రమాదేవి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పదవిలో ఉన్న ఒంటుబు ప్రియాంక తను వ్యక్తి గత కారణాలతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో ఉపాధ్యక్ష పదవికి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

సీలేరు గురుకుల పాఠశాలలో 5,6.9 తరగతుల్లో ఖాళీలు

సీలేరు, ఆగస్టు 12, (ఆంధ్రజ్యోతి) : సీలేరు బాలుర గురుకుల పాఠశాలో 5, 6, 9 తరగతుల్లో విద్యార్థులు చేరేందుకు ఖాళీలు ఉ న్నాయని ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. 5వ తరగతిలో 50 సీట్లు, 6వ తరగతిలో 10 సీట్లు, 9 వ తరగతిలో 8 సీట్లు ఖాళీలు ఉన్నాయని, అర్హత కలిగిన విద్యార్థులు పాఠశాల పనివేళల్లో విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రాలతో రావాలని కోరారు.

అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర

» అరకులోయలో అన్నదాత సుఖీభవ ర్యాలీ



ర్యాలీలో ట్రాక్టర్‌ను నడుపుతున్న దొన్నుదొర, టీడీపీ నాయకులు

అరకులోయ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం అందజేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల సందర్భంగా మంగళవారం రైతులతో కలిసి దొన్నుదొర, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ట్రాక్టర్ ర్యాలీని చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంనుంచి అరకు సంతబయలు వరకు 50 ట్రాక్టర్లతో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా రైతులకు ప్రభుత్వం ఏడాదికి చెల్లించాల్సిన రూ. 20వేలలో తొలి విడతగా రూ.7 వేలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం తోడ్పాటును అందించే విధంగా చర్యలు తీసుకుంటుందని దొన్నుదొర ఈ సందర్భంగా తెలిపారు. ఈ ర్యాలీల్లో రైతులు ముఖ్యమంత్రి, కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు.

అటవీశాఖ స్థలం ఆక్రమణకు అడ్డుకట్ట



గురుతెలియని వ్యక్తులు వేసిన రాళ్లకుప్పలను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

అనంతగిరి, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని టోకూరు పంచాయతీ ములియగుడ సర్వే నంబర్ 13/1 సుమారు 2 ఎకరాల స్థలాన్ని అటవీశాఖ రేంజ్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించారు. అయితే, గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లకుప్పలు వేయడంపై మంగళవారం తహశీల్దార్ వీరభద్రచారికి ఫిర్యాదు చేసినట్టుగా రేంజర్ సుధీర్ తెలిపారు. అటవీశాఖ సిబ్బందినీ ఈ ప్రదేశానికి పంపించారు. రేంజ్ కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడం.. పనులు ప్రారంభించలేదని, నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేలా చర్యలు చేపట్టనున్నట్టుగా రేంజర్ ఈ సందర్భంగా తెలిపారు. అటవీశాఖ కేటాయించిన స్థలం చుట్టుపెన్సింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బాబూజీరావు



ముంచంగిపుట్టు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఎంపికైన బాబూజీరావు

ముంచంగిపుట్టు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా సామల బాబూజీరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో చిత్తశుద్ధితో పని చేస్తున్న తనను గుర్తించి పీఏసీఎస్ పదవిని ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మరింత ఉత్సాహంతో రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. వారికి సం క్షేమ పథకాలు చేరేలా చూస్తానని చె ప్పారు.

సంగడలో బస్ షెల్టర్ పనులు



బస్ షెల్టర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం డుడుమ జలాశయం సమీ పాన సంగడలో బస్ షెల్టర్ నిర్మాణానికి వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జడ్పీ నిధులు రూ.5లక్షలు వెచ్చించి బస్ షెల్టర్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేశారని అన్నారు. సర్పంచ్ కిరసాని మిల్కీ, వైసీపీ నేతలు జేవీవీఎన్ మూర్తి, ఎ. జగబంధు, పాంగి పద్మారావు, రాజేంద్ర, గురుమూర్తి, సుభాష్, రాంప్రసాదు, దేవ పాల్గొన్నారు.

'మద్దిగరువును మండల కేంద్రంగా మార్చాలి'




కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న మండల సాధన సమితి ప్రతినిధులు

పాడేరురూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జి.మాడుగుల, పెదబయలు మండలాలకు చెందిన 13 పంచాయతీలకు కేంద్ర బిందువుగా ఉన్న జి.మాడుగుల మండలం మద్దిగరువులో ప్రభుత్వం కొత్తగా మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు మద్దిగరువు మండల సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం పాడేరులో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరిలను కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి ప్రతినిధులు ఎల్.అప్పలరాజు, మునిపల్లి పండన్న తదితరులు మాట్లాడుతూ జి.మాడుగుల మండలంలోని కిల్లంకోట, బొయితిలి, నుర్మతి, బీరం, లువ్వాసింగి పంచాయతీలు, పెదబయలు మండలంలోని జామిగుడ, ఇంజరి, గిన్నెలకోట, బొంగరం, లింగేటి, గుల్లెలు, కుంతుర్లతో పాటు ముంచంగిపుట్టు మండలంలోని బూసిపుట్టు పంచాయతీలకు చెందిన 236 గ్రామాల్లో సుమారు 36, 356 మంది జీవనం సాగిస్తున్నారన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉండడంతో ఇంత వరకు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ఈ 13 పంచాయతీలకు ప్రధాన కేంద్రంగా ఉన్న మద్దిగరువును మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే అభివృద్ధికి వీలవుతుందన్నారు. అధిక సంఖ్యలో ఈ ప్రాంత రైతులు పసుపు, పిప్పళ్లు, అపరాల పంటలను సాగిస్తుంటారని, ఇక్కడ మార్కెట్‌తో పాటు గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు.

గుండెపోటుతో నీటి సంఘం చైర్మన్ మృతి

కొయ్యూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):మంప గ్రామపంచాయతీకి చెందిన నీటి సంఘం చైర్మన్ గొల్లపల్లి చిన్నచిన్నారావు (56) గుండెపోటుతో మృతి చెందారు. చిన్నచిన్నారావు గంగవరం నీటి సంఘానికి చైర్మన్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా గుండెపోటుతో రావడంతో అతను మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొమ్మికలో త్రుటిలో తప్పిన ప్రమాదం



తెగిపోయిన విద్యుత్ తీగలు

కొయ్యూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మిక పంచాయతీ కేంద్రంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం మధ్యాహ్నం పిడుగులతో గాలీ వానా కురిసింది. దీంతో 11 కేవీ విద్యుత్‌లైన్లు ఒక్కసారిగా తెగి పడిపోయాయి. ఆ సమయంలో సమీపంలో ప్రజలు లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. కొమ్మిక ఆశ్రమ పాఠశాలలోనూ విద్యుత్ తీగలు తెగిపోయాయి. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ తీగలు పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు.

నులి పురుగుల నివారణతోనే శారీరక ఎదుగుదల



అరకులో విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను అందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ కొండబాబు, ఎస్ఎస్ పీవో అనితకుమారి

అరకులోయ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ పీవోలు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కొండబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, అధ్యాపలకు వీటిని అందజేశారు. అధ్యాపకులు అనితకుమారి, పి. బలరాం, ప్రణీత, రక్షితారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: నులి పురుగుల నివారణతోనే శారీరక ఎదుగుదల సాధ్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. గేదలబంద గ్రామంలోని పాఠశాలలో చిన్నారులకు నులి పురుగుల మాత్రల ను పంపిణీ చేశారు. ఈ ఎంపీహెచ్‌వో సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ సంజీవ్ కుమార్, ఏఎన్ఎం బుల్లమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పీ రోషిణి పాల్గొన్నారు.



పెదబిడ్డ విద్యార్థులకు మాత్రం వేస్తున్న దృశ్యం

పెదబయలు:స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ ఆధ్వర్యంలో పాఠశాలు, అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు నులిపురుగు నివారణ మా త్రలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని లుంగపర్తి పీహెచ్‌సీ పరిధిలోని పెదబిడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని బాలికల వైద్యాధికారి మంజుభార్గవి ఆధ్వర్యంలో ఆల్బండాజోల్ మాత్రలను మంగళవారం వేయించారు. నులిపురుగులతో పిల్లలు అనారోగ్యానికి గురవుతారన్నారు. చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. హెచ్ఎం కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



గేదలబంద పాఠశాలలో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి ఉద్యమం ప్రత్యేకం

» జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు



డిగ్రీ కళాశాల వద్ద అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు, మాజీ మంత్రి బాలరాజు

చింతపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి ఉద్యమం, రంప తిరుగుబాటు ప్రత్యేకమైనవని జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన తొలుత స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పేరు చెప్పగానే చింతపల్లి, గిరిజన ప్రాంతం గు ర్తుకు వస్తుందన్నారు. బ్రిటీష్ పాలకుల అరాచకాలు, దురాగతాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సీతారామరాజు ఆదివాసీలకు అండగానిలిచి రంప తిరుగుబాటుకి శ్రీకారం చుట్టారన్నారు. చింతపల్లి బ్రిటీష్ పోలీసు స్టేషన్ దాడితోనే సీతారామరాజు సాయుధ పోరాటాన్ని ప్రారంభించారన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ, అత్యాధునిక ఆయుధాలులేని సమయంలో నిరక్షరాసులైన ఆదివాసీలను చైతన్యం చేసి రెండేళ్లపాటు బ్రిటీష్ పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేశారన్నారు. ఆయన చరిత్రను అధ్యాపకులు, మేధావులు, విద్యావంతులు భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు మాట్లాడుతూ అల్లూరి నడయాడిన నేలలో తాను జన్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అల్లూరి ఉద్యమం స్వాతంత్ర్య పోరాటంలో ఓ చరిత్ర సృష్టించిందన్నారు. ఆయన స్మారక చిహ్నాలు చింతపల్లి, కొయ్యూరు, కృష్ణాదేవిపేటలో ఉన్నాయని, వీటిని ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగావిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి, జనసేన పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య, అరకు ఇన్‌చార్జి శెట్టి చిరంజీవి, అల్లూరి మునిమనవడు శ్రీరామరాజు, జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, పార్టీ సీనియర్ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, ఉల్లి సీతారామ్, సుర్లవీరేంద్ర, గొర్లె వీరవెంకట్, విగ్రహదాత దూనబోయిన రమణ, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు గెమ్మెలి మోహన్‌రావు, ముర్ల వెంకట రమణ పాల్గొన్నారు.

యువజన దినోత్సవ క్యాంపెయిన్ విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు

పాడేరురూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెండు నెలల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ యువజన దినోత్సవ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శా ఖాధికారి డాక్టర్.టి.విశ్వేశ్వరరావు నాయుడు మాట్లాడుతూ ఈ ప్రచారా న్ని రానున్న రెండు నెలల్లో జిల్లా వ్యాప్తంగా యువతపై దృష్టి సారించి హెచ్ఐవీ, ఎయిడ్స్ లైంగికంగా సంక్రమించే వ్యాధులు, మాదకద్రవ్యాలవాడకం తదితర అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్.కిరణ్‌కుమార్, ఎయిడ్స్ నియంత్రణ విభాగం ప్రోగ్రామ్ మేనేజర్ రామచందర్, డీఎండీవో చిరంజీవి, ఎల్‌డబ్ల్యూఎస్, ఎస్‌వీడీఎస్, ఎన్జీవోలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పాడేరురూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అఖిల భా రత విద్యార్థి స మాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణ, కె.రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద విద్యార్థుల సమక్షంలో పతాకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంనుంచి బ్రిటీష్ తెల్లదొరను తరిమి కొట్టేందుకు 1936 ఆగస్టు 12వ తేదీన ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వ విద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తోందన్నారు. ప్రభుత్వ విద్య ను పరిరక్షించాల్సిన ప్రభుత్వాలే విద్యా వ్యవస్థను కాలరాస్తున్నాయన్నా రు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యను కాషాయకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అమర్ జ్యోతి, జగదీశ్, ఇషాక్, బాలు పాల్గొన్నారు.

పీఎం జీవనజ్యోతి బీమా చెక్కు అందజేత



మృతుని కుమారుడికి చెక్కు అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన చెక్కును బాధిత కుటుంబానికి కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో అందించారు. చింతపల్లి మండలానికి చెందిన గోకాడ నాగరాజు గత ఏడాది మార్చి 24న సహజ మరణం పొందారు. ఆయన కుమారుడైన చరణ్ తేజకు మంగళవారం రూ. 2 లక్షల చెక్కును అందించారు. జననీ సురక్షపై జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు జిల్లా లోని 430 గ్రామ పంచాయతీల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు ఎల్‌డీఎం మోతునాయుడు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ గౌతం కుమార్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేపడుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిలగాడ పీహెచ్‌సీలో విజయనగరానికి చెందిన వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. 284 మందికి కంటి వైద్య పరీక్షలను కిలగాడ వైద్యాధికారి శిరీషతో పాటు పలువురు ప్రత్యేక వైద్య నిపుణులు నిర్వహించారు. 49 మందిని గుర్తించి శస్త్ర చికిత్స నిమిత్తం ప్రత్యేక వాహనంలో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. మరో 32 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించనున్నట్టు చెప్పారు. క్యాంప్ కో ఆర్డినేటర్ భీమ్‌శంకర్, ఆప్తాల్మిక్ అధికారి వి.కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండాలి: ఏఎస్పీ ధీరజ్



డిగ్రీ కళాశాలలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఎస్పీ ధీరజ్

అరకులోయ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ధీరజ్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్ఐటీఐ విద్యార్థులకు ఎస్ఐ గోపాలరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఎస్పీ ధీరజ్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, గంజాయి వ్యాపారుల వలలో పడి, బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. ఈ కేసుల్లో ఇరుక్కుంటే చట్టపరంగా ఎంతటి ఇబ్బందులు ఎదురుతాయో ఆయన వివరించారు. కళాశాలల్లో ఈగల్ టీంలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలైన వారుంటే వాళ్లని డీ అడిక్షన్ సెంటర్లకు పంపించి వ్యసనం నుంచి విముక్తి చేయడానికి తమ శాఖ కృషి చేస్తోందన్నారు. అలాగే, గంజాయికి బదులుగా ప్రత్యామ్నాయ సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకుని అభివృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యువత అడిగిన పలు ప్రశ్నలకు ఏఎస్పీ సమాధానాలు చెప్పారు. ఈ సమావేశంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు,ఆర్ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

పదో తేదీ దాటినా రేషన్ పంపిణీ చేయరా?

» గిరిజన సంఘం నాయకులు

పెదబయలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్ డిపోలో పదో తేదీ దాటినా లబ్ధిదారులకు బియ్యం, అంగన్‌వాడీ సెంటర్లకు రేషన్ పంపిణీ చేయకుండా జీసీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని ఆదివాసీ పూర్వ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు ఆరోపించారు. ప్రతి నెలా వచ్చిన రేషన్ బియ్యం, నిత్యావసర స రకులు ఒడిశా ప్రాంతానికి తరలిస్తున్నట్టు తెలిపారు. రేషన్ బియ్య కొద్ది మంది లబ్ధిదారులకుఇచ్చి మిగిలిన బియ్యం విక్రయిస్తున్నట్టు ఆయన ఆరోపించారు. ఇటీవల స్థానిక గోదాం సూపర్‌వైజర్ లక్షలాది రూపాయల ప్రజాధనం అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు జంబు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో కాపర్ వైర్ చోరీకి యత్నం

ముంచంగిపుట్టు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విలువైన కాపర్ వైర్ చోరీకి మంగళవారం ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. సెక్యూరిటీ గార్డులు గుర్తించి ఈ వైరును స్వాధీనం చేసుకున్నారు. ప్రాజెక్టులో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది సుమారు 10 మీటర్లు, సుమారు 30 కేజీల బరువు ఉన్న కాపర్ వైర్‌ను వాహనంలో తరలించేందుకు ప్రయత్నించారు. సెక్యూరిటీ గార్డులు గుర్తించి ప్రాజెక్టు ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రాజెక్టు ఈఈ జనరేషన్ సూచనల మేరకు పట్టుబడిన ఇద్దరు నిందితులను మాచ్‌ఖండ్ పోలీసులకు అప్పగించారు. ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరాలు లేక తరచూ విలువైన సామగ్రి చోరీకి గురవుతున్నట్టు సిబ్బంది చెబుతున్నారు.

'గిరిజన భూములను టూరిజం ప్రాజెక్టుకు అప్పగించొద్దు'

అనంతగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని భీంపోల్ పంచాయతీ నందకోట రెవెన్యూ పరిధి 28 సర్వే నంబర్‌లో గల భూముల్లో ప్రైవేట్ టూరిజం ప్రాజెక్టు చేపడితే రైతు కుటుంబాలు రోడ్డున పడతాయని సీపీఎం నాయకుడు జేష్ఠ రమణ తెలిపారు. మంగళవారం తహశీల్దార్ వీరభద్రచారి ఆయా భూములను పరిశీలించేందుకు వచ్చారన్నారు. ఈ భూముల్లో ఏడుగురు రైతులకు డీ పట్టాలను ప్రభుత్వం ఇచ్చిందని, ఇందులో టేకు, జీడితోటలు, కమల, బత్తాయి పంటలను వేసుకుని రైతులు జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో గిరిజనులకు నష్టం లేకుండా చూడాలని ఆయన కోరారు.



గొలుగొండలో కురుస్తున్న వర్షం

భారీ వర్షం.. అన్నదాత హర్షం

గొలుగొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం పడింది. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములతో కూడిన వాన పడింది. గొలుగొండ, జోగంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, పాతమల్లంపేట, ఏటిగైరంపేట గ్రామాల్లో ఎక్కువగా వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడిపోయింది. ఎండలకు ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు ఈ వర్షంతో ఊరట చెందారు. అలాగే ప్రస్తుతం వ్యవసాయ పనులకు ఈ వాన ఎంతగానో దోహదపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణాదేవిపేటలో..



కృష్ణాదేవిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఏఎల్‌పురం, కొంగశింగి, సిహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట గ్రామాల్లో వాన పడింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా, ఈ వానతో వీధి రోడ్లు బురదమయంగా మారాయి.

సాగు హక్కు కల్పించాలని గిరిజనుల ధర్నా



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

గొలుగొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సాగు భూములకు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు ధర్నా చేశారు. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ పాత మల్లంపేట రెవెన్యూలోని బుడ్డపాడు, పోలవరం గ్రామాలకు చెందిన గిరిజనులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కు కల్పించకుండా బడాబాబులకు ఆన్‌లైన్‌లో చేసేందుకు రెవెన్యూ సిబ్బంది ఉత్సాహపడుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి గిరిజనులకు సాగు హక్కు కల్పినంచాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అంతించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.నారాయణమూర్తి, ఎ.రాజు, గిరిజనులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యకర్తకు ఆర్థిక సాయం

నాతవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యకర్త యాగం గౌతమ్‌కు తాండవ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. గౌతమ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటిలోనే ఉండడంతో, అతని స్నేహితులు డబ్బులు సమీకరించి అందించారు. గౌతమ్ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచండి

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి
- పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



ఎర్రవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

నర్సీపట్నం/గొలుగొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నర్సీపట్నంలోని శివపురం-1, 2 కేంద్రాలు, బీసీ కాలనీలోని బాలసదనంతో పాటు గొలుగొండ మండలంలోని గుండుపాల, ఎర్రవరం, చీడిగుమ్మల, ఎరకంపేట, పోలవరం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. అలాగే గొలుగొండ ఐసీడీఎస్ కార్యాలయాన్ని పరిశీలంచారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే కేంద్రాల్లో సమయపాలన పాటించాలన్నారు. కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ, అనుబంధ పోషకాహార పంపిణీపై అంగన్‌వాడీలు పాటించాల్సిన అంశాలను వివరించారు. అలాగే సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ కార్యక్రమాల్లో సీడీపీవో జీవీ రమణ, శ్రీగౌరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

నర్సీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగు నివారణ దినం సందర్భంగా మంగళవారం మాత్రలను పంపిణీ చేశారు. పట్టణంలోని పెదబొడ్డేపల్లి మెప్మా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ సురేంద్ర, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ యశోధ పాల్గొన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు నులి పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీవో రమాదేవి పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ శ్యామ్‌కుమార్, వైద్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో ఈ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలు, పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణాదేవిపేట వైద్యాధికారి గాయత్రి మాట్లాడుతూ ఈ మాత్రలను ఐదు నుంచి 60 ఏళ్ల వారంతా వేసుకోవచ్చని చెప్పారు. అయితే బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 జి.కృష్ణప్రసాద్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలని ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ కార్మికులు

నర్సీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలని, ఐఆర్‌లు ప్రకటించాలని నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో డిపో గేటు ధర్నా మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌ఎమ్‌యూ రీజనల్ అధ్యక్షుడు ఆర్ఎన్.రాజు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాలు ప్రైవేటు సంస్థలకు ఇచ్చే విధానాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఖాళీ స్థలాలు వివిధ సంస్థలకు ఇస్తున్నట్టు ఇచ్చిన జీవో వెనక్కి తీసుకోవాలన్నారు. ఖాళీలు భర్తీ చేయాలని, పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. ఎన్‌ఎంయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు శంకర్రావు, జీఎస్ నారాయణ పాల్గొన్నారు.

స్పీకర్ కృషితో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్

- టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రుడు

మాకవరపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెంలో రూ.10 కోట్లతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి ఎంతో ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు చెప్పారు. మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాఫీ పొడి తయారీ కేంద్రాన్ని స్పీకర్ ప్రతిపాదించగా సీఎం చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారన్నారు. ఇకపై శెట్టిపాలెంలోనే అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కాఫీ పొడి తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేయనున్నట్టు చెప్పారు. కంపెనీ ప్రారంభంలోనే సుమారు 300 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీలు తీసుకువచ్చేందుకు ఇక్కడ సుమారు 600 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారన్నారు. సమావేశంలో తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు చినబాబు, ఏఎంసీ డైరెక్టర్ రమణ, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, టీడీపీ నాయకులు జోగిపాత్రుడు, రాంబాబు, నందకిశోర్, ప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన జనసేన నాయకులు



పంచకర్లకు జ్ఞాపిక అందిస్తున్న జనసేన నాయకులు

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఎమ్మెల్యే, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబును నర్సీపట్నం నాయకులు మంగళవారం కలిశారు. అల్లూరి జిల్లా చింతపల్లి పర్యటనకు వెళ్తున్న ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కొద్దిసేపు పార్టీ విషయాలను చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పంచకర్ల సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వూడి చక్రవర్తి, జి.దొరబాబు, సలాదుల దేవి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సాగులో లేని భూములకు ఈక్రాప్ నమోదు చేసుకోండి

గొలుగొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగులో లేని భూములకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి సూచించారు. సాలికమల్లవరం గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో ఈ క్రాప్ పంటల నమోదు చేయాలన్నారు. వచ్చే నెలాఖరులోగా ఈ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. వరినాట్లపై వ్యసాయాధికారుల సలహాలు తీసుకోవాలని చెప్పారు.

గిడుతూరులో పొలం పిలుస్తోంది..

మాకవరపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడుతూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అప్పారావు మాట్లాడుతూ ఎకరా వరి పంటకు 75 కిలోల యూరియా సరిపోతుందన్నారు. ఆఖరి దమ్ములో 25 కిలోలు, నాట్లు వేసిన 30 రోజులకు 25 కిలోలు వేయాలని చెప్పారు. అలాగే 45 రోజులకోసారి మిగిలిన 25 కిలోలు వేసుకోవాలని ఆయన సూచించారు. తెగుళ్లు రాకుండా రైతులు వ్యవసాయాధికారులు సూచనలు పాటించాలని చెప్పారు.

ఘనంగా లైబ్రేరియన్స్ డే

నర్సీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతి సందర్భంగా ఇక్కడి శాఖా గ్రంథాలయంలో మంగళవారం లైబ్రేరియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి విశ్రాంత గ్రంథాలయ అధికారి త్రిమూర్తులురెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాలకు, దేశానికి చేసిన సేవలను వివరించారు. అనంతరం విశ్రాంత రికార్డు అసిస్టెంట్ కొండబాబును సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దమయంతి, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, పాఠకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ రాజారావు సూచించారు. నర్సీపట్నంలోని విద్యా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ యువత సరైన మార్గంలో నడవాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఆర్‌ఈ కౌన్సిలర్ గణపతి, సమిధ ప్రాజెక్టు డైరెక్టర్ డి.వీరభద్రరావు, ప్రాజెక్టు మేనేజర్ వరహాలుబాబు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపాలి

నర్సీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పాత బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతంగా చదువుకుని స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులు, ఉచిత బస్ ప్రయాణం పథకంతో నష్టపోతారన్నారు. వాహన మిత్ర పథకం కింద ప్రతీ కార్మికుడికి రూ.25 వేలు ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు.

ఊరటనిచ్చిన వాన



చోడవరంలో పడుతున్న వర్షం

చోడవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వేసవిని తలపించే ఎండలు కాస్తున్న సమయంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం స్థానికులకు ఊరటనిచ్చింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రంగా కాసింది. దీంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు సేదదీరారు. ఈ వర్షం ఎండిపోతున్న వరి నారుమడులకు ఊపిరిపోసిందని రైతులు తెలిపారు.

దేవరాపల్లిలో..

మండలంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. ఉదయం అంతా భానుడు భగభగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో ప్రజలు సేదదీరాఉ. ఈ వర్షం వరి నాట్లు, సరుగుడు, కూరకాయల పంటలకు మేలు చేకూర్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సూర్యఘర్‌పై ప్రజల్లో చైతన్యం తేవాలి

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

రావికమతం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకంలో ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకునేందుకు ప్రజల్లో సిబ్బంది చైతన్యం తీసుకురావాలని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఎస్ఈ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఈ పథకంపై సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ వినియోగం పెరుగుతున్నందున తగిన రీతిలో జల,థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెరగడం సాధ్యం కాదన్నారు. ఈ కారణంగా భారత ప్రభుత్వం సౌర విద్యుత్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ నూరు శాతం ఉచితంగా ఏర్పాటు చేస్తుందన్నారు. ఓసీ, బీసీ, ఇతర వర్గాలకు 45 శాతం రాయితీపై మంజూరు చేస్తామన్నారు. ఇప్పటివరకు 195 మంది వినియోగదారులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకుని, 13 మంది మాత్రమే సోలార్ రూఫ్ టాప్‌లను అమర్చుకోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం ఈఈ ఏవీఎస్ఎం.అప్పారావు, ఏడీఈ సురేష్, రావికమతం ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీపీ అగ్రహారంలో భూలోకమ్మ విగ్రహ ప్రతిష్ఠ రేపు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీపీ అగ్రహారంలో ఈనెల 14వ తేదీన భూలోకమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉదయం 7.28 గంటలకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామని వారు చెప్పారు.

ఉపాధి హామీ బిల్లుల అప్‌లోడ్‌కు లంచాలు

- కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనుపై సభ్యుల ఆరోపణ..
- విచారణ జరిపిస్తామని ఎంపీడీవో హామీ

రావికమతం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్ శ్రీను లంచం ఇస్తేనే గాని చేయడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని గొంప, రావికమతం ఎంపీటీసీ సభ్యులు గంజి సూర్యనారాయణ, వేపాడ లక్ష్మి తదితరులు ఆరోపించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సర్యనారాయణ మాట్లాడుతూ, 2014-15 సంవత్సరంలో ఉపాధి హామీలో చేసిన అభివృద్ధి పనులకు అప్పట్లో 80 శాతం బిల్లులు చెల్లించారన్నారు. ఈలోగా ప్రభుత్వం మారడంతో 20 శాతం బిల్లులు చెల్లించలేదన్నారు. అప్పులు చేసి పనులు పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో 20 శాతం బిల్లు చెల్లింపునకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ ఐదు శాతం పర్సంటేజ్ ఇవ్వాలని, లేకుంటే తన వద్దకు రావద్దంటూ చెబుతున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో చేసిన రెండు రోజుల పనులకు కూలీల వేతనాలు చెల్లించలేదని, క్షేత్ర స్థాయిలో ఉపాధి సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని, సమగ్ర విచారణ చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో అవకతవకలపై విచారణ జరిపిస్తామని ఎంపీడీవో సీతారామస్వామి సభ్యులకు హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు ఎరువుల విక్రయాలు చేస్తున్నారని, మండల వ్యవసాయాధికారి ఏమి చేస్తున్నారని సభ్యులు నిలదీశారు. కొత్తకోటలో మండల పరిషత్ షాపులను బహిరంగ వేలం వేయాలని కొత్తకోట ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. ఇకపై అలా జరగదని, అందరూ వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహశీల్దార్ అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ సీలింగ్ భూములకు అన్నదాత సుఖీభవ వర్తించదు

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

చీడికాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ సీలింగ్ పట్టా భూములను ప్రభుత్వ భూములుగా గుర్తించడంతోనే తునివలస గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేయలేదని జిల్లా వ్యవసాయ అధికారి జి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని తునివలస గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం నగదు జమ కాలేదని సోమవారం జిల్లా మీకోసంలో ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు మంగళవారం మధ్యాహ్నం జేబీ.పురం రైతుసేవా కేంద్రంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ, గతంలో పీఎం కిసాన్, రైతుభరోసా వచ్చాయని, ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకంలో తమ పేర్లు రాలేదన్నారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, 2023 రీసర్వే ప్రకారం సెక్షన్ 22/ఎ కింద బ్లాక్ చేసిన ప్రభుత్వ భూముల కింద వీటిని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అలాంటి భూములు ఉన్న వారికి అన్నదాత సుఖీభవ పథకం మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకునేవరకూ వేచి చూడాలన్నారు. ఈ విచారణలో తహశీల్దార్ కిషోర్‌లింకన్, వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రనాథ్, ఏఈవో లోకేష్, ఎంపీఈవో అరుణ, మాజీ సర్పంచులు పేరపు కొండబాబు, గొల్లవిల్లి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



ఏకొత్తపల్లిలో మాత్రలు వేస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి

చోడవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని గవరవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చప్పగడ్డ మాణిక్యమ్మ, మాజీ సర్పంచ్ చప్పగడ్డ వెంకట స్వామినాయుడు, గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రదీప్, సత్యదీపిక, మేఘనలతో పాటు, హెచ్‌ఎం జీజే సుందర్‌సింగ్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం దేవరాపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు డి వార్మింగ్ మాత్రలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైద్యాధికారిణి పూజిత మేఘన, సీహెచ్‌ఓ ఆనంద్, హెచ్ఎస్ పుష్పరాజు, హెచ్‌ఎం ఉమ పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంపీడీవో సాంబశివరావు నులిపురుగులు మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, కస్తూర్బా విద్యాలయాలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

రావికమతంలో..

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కొత్తకోట హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి రజినీ, ఆరోగ్య విస్తారణ అధికారి పాతాళ రామారావు,సిబ్బంది, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలోని సీతయ్యపేట హైస్కూల్ విద్యార్థులకు జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వజ్రపు శ్రీను, చైర్మన్ మహేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎంమురళీధర్, తురకలపూడి వైద్యాధికారిని సంధ్యరాణి, ఎల్‌టీ రాజుబాబు పాల్గొన్నారు. దిబ్బిడిలో ప్రధానోపాధ్యాయులు సత్యారావు, బుచ్చెయ్యపేట వైద్యాధికారులు కేవీ కృష్ణ, కె.రమేష్ పాల్గొన్నారు.

చీడికాడలో..

మండలంలో చీడికాడ పీహెచ్‌సీ పరిధిలో 3,280 మంది పిల్లలకు డివార్మింగ్ మాత్రలు వేయాలని లక్ష్యం కాగా, మంగళవారం 3,077మందికి వేసినట్టు వైద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్. చంద్రశేఖరరావు, పీహెచ్ఎన్ సత్యవతి, ఏఎన్ఎం నాగమణి పాల్గొన్నారు.

వరి నాట్లు దూరంగా వేయండి : ఏవో

దేవరాపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు దూరంగా వేసుకుంటే తెగుళ్లు వేగంగా విస్తరించవని మండల వ్యవసాయాధికారిణి ఎల్.వై.కాంతమ్మ రైతులకు సూచించారు. మంగళవారం బి.కింతాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి నాట్లపై రైతులకు అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసినప్పుడు బాటలు తీయాలని, దాని వలన పురుగు ఆశించినా ఎక్కువ నష్టం కలగదన్నారు. అక్టోబరు 15లోగా బీమా చేయించుకోవాలన్నారు. ఎకరానికి రూ.84 చెల్లించాలన్నారు. సర్పంచ్ బూరే బాబూరావు, రైతు కొమార బాబూరావు, కడిం నాగేశ్వరరావు, రాజుబాబు, విస్తరణ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని స్థానిక వ్యవసాయాధికారి సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఆర్‌వై అగ్రహారం, కేజే పురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాత్రుని నాయుడు, లెక్కల అచ్చిబాబు, గొర్లి అప్పారావు, శ్రీనివాసరావు, గునూరు సత్యనారాయణ, వీఏఏ కళ్యాణి పాల్గొన్నారు.

లక్కవరం సొసైటీ చైర్‌పర్సన్‌గా నారాయణరావు



చోడవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరం సహకార సంఘానికి కొప్పు నారాయణరావు చైర్‌పర్సన్‌గా, నాగారావు అప్పలరాజు, కర్రి వెంకట రమణ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. నారాయణరావును చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు టీడీపీ నాయకులు వబలరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

'సంకష్టహర చతుర్థి' ప్రత్యేక పూజలు

రావికమతం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం బాలవర సిద్ధి వినాయకుని ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజలు మంగళవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు గుంటూరు లక్ష్మణరావు, రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్ రంగనాథన్ జయంతి

రోలుగుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్ రంగనాథన్ 133 జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శేషగిరిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పోలీసులు వాహనాల తనిఖీలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమదిన జంక్షన్‌లో మంగళవారం అత్యాధునిక టెక్నాలజీతో వాహనాలను పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేకాట స్థావరాలు, గంజాయి స్మగ్లర్ల జాడ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నామన్నారు. ఆయనతో పాటు సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అన్ని రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు.

ఏఎంసీ చైర్మన్ అప్పలరాజుకు సన్మానం

చీడికాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుని ఏఎంసీ డైరెక్టర్ శరగడం లక్ష్మి, శివ దంపతులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా బి.సింగవరంలో తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసినందుకు తనకు ఈ గుర్తింపు వచ్చిందన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణం పోసే అవయవ దానం





విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో కిడ్నీ, లివర్, హార్ట్ వంటి శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాలు పొద్దై దాతల కోసం ఎదురు చూస్తున్న లక్షలాది మంది బాధితు లున్నారు. వారి ప్రాణాలను కాపాడేందుకు ఉన్న ఏకైక అవకాశం అవయవదానం. ఇటువంటి గొప్ప కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ఎంతోమంది దాతల కోసం ఎదురు చూస్తూనే ప్రాణాలు విడుస్తున్నారు. బాధితుల్లో కొందరి ప్రాణాలనైనా కాపాడాలన్న ఉద్దేశంతో దేశంలో కొన్నాళ్లుగా అవయవదాన ఉద్యమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చే వారిని ప్రభుత్వం కూడా ప్రోత్సహి స్తోంది. ప్రజల్లో అవయవదానం పట్ల అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 13న జాతీయ అవయవదాన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

అవయవదానం అంటే ఒక వ్యక్తి మరణానం తరం తన అవయవాలను మరో వ్యక్తి ద్వారా దానం చేయడం. ఇది ప్రాణదానంతో సమానం. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవా లను, అవయవాలు పాడై చికిత్స పొందుతూ ఉన్న వ్యక్తికి అమర్చడాన్ని అవయవదాన మార్పిడి అంటారు. అవయవదానం చేసే వ్యక్తిని బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన తరువాత మాత్రమే దానం చేసేందుకు అవకాశం ఉంది. కిడ్నీలు, లివర్ బతికుం డగానే దానం చేయవచ్చు. ప్రమాదం వల్ల గానీ, మరో కారణం వల్ల గానీ బ్రెయిన్‌డెడ్ అయిన తరువాత అవయవదానం చేస్తుంటారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జీవన్‌దాన్ వెబ్‌సైట్ ద్వారా గానీ, స్వచ్ఛంద సంస్థలో గానీ పేరు నమోదు చేసుకుని అవయవదానం చేయడానికి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవచ్చు. జీవన్‌దాన్ కార్యక్రమాన్ని 2015 నుంచి రాష్ట్రంలో అమలుచేస్తున్నారు.

దాతల కోసం నిరీక్షణ..

ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి మంది బాధి తులు అవయవదాతల కోసం ఎదురు చూస్తున్నట్టు అంచనా. ఇలాంటి వారు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఐదు వేల మంది ఉన్నారు. ఇందులో 1,491 మందికి లివర్, 3,062 మంది కిడ్నీ, 81 మంది గుండె, 15 మంది లంగ్స్, నలుగురికి ప్రాంక్రియాస్ అవసరం. ఇప్పటివరకు జీవన్‌దాన్ ద్వారా 1,148 మందికి వివిధ రకాల అవయవాలను సమకూర్చారు. ఇందులో 638 మందికి కిడ్నీ, 279 మందికి లివర్, 88 మందికి గుండె, 151 మందికి ఊపిరితిత్తులు, ముగ్గురికి పాంక్రియాస్, స్మాల్‌బౌల్‌ను ఒకరికి అందించారు.

ఒక వ్యక్తి అవయవాలతో 18 మందికి పునర్జన్మ

- అపోహలు, అనుమానాలతోనే చాలామంది దూరం
- అవగాహన కార్యక్రమాలతో ముందుకొస్తున్న దాతలు
- వ్యాపారాత్మక ధోరణికి అడ్డుకట్ట పడాలంటున్న నిపుణులు
- అవయవదాతకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ప్రభుత్వం
- నేడు జాతీయ అవయవదాన దినోత్సవం



విమ్స్‌లో నిర్వహణ..

విమ్స్‌లో అవయవాలను సేకరించే శస్త్రచికిత్సల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కొద్దినెలల కింద ట తొలిసారిగా లివర్ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. ఇప్పటివరకు విమ్స్‌లో నాలుగు బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాలను సేకరిం చారు. విమ్స్ తరహాలోనే కేజీహెచ్‌లోనూ అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహిస్తే నిరుపేద రోగులకు మేలు జరుగుతుందని భావి స్తున్నారు.



అవగాహన అవసరం..

దేశంలో సుమారు మూడు లక్షల మంది, రాష్ట్రంలో ఐదు వేల మంది, ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది అవయవదాతల కోసం ఎదురుచూస్తూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అవయవదానం పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడంతో చాలామంది ముందుకు రావడం లేదు. స్పెయిన్‌లో 46.9 శాతం, అమెరికాలో 31.96 శాతం మంది అవయవదానం చేసేందుకు ముందుకు వస్తుండగా భారత్‌లో ఒకశాతం మంది కూడా ఆసక్తి చూపడం లేదు. అయితే రాష్ట్రంలో ఈ పరిస్థితి కొంతమెరుగ్గా ఉంది. సుమారు 3.5 శాతం మంది అవయవదానానికి ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే గతంలో ఏపీ కేంద్రం నుంచి బెస్ట్ ఎమర్జింగ్ స్టేట్ ఇన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవార్డును అందుకుంది.

ఇవి దానం చేయొచ్చు..

ప్రతి వ్యక్తి శరీరం నుంచి 11 రకాల అవయవాలను దానం చేయవచ్చు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి శరీరం నుంచి గుండె, రెండు జతల కవాటాలు, కిడ్నీలు, నేత్రాలు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమం, ప్రాంక్రియాస్, కర్ణభేరి, గాల్‌బ్లేడర్, యూరినరీ బ్లేడర్, చర్మం, ఎముకలు, కండరాలు, ఎముకల్లోని మజ్జ వంటివి సేకరించవచ్చు. ఈ అవయవాలతో 18 మంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంది.

ప్రజలను జాగృతం చేస్తున్నాం



ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో జీవన్‌దాన్ ద్వారా అవయవదానం పట్ల పెద్దఎ త్తున అవగాహన కలిగిస్తున్నాం. ఇప్పటివరకు ఎంతో మందికి అవయవాలను సమకూర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాం. ఇంకా చాలామంది బాధితులున్నారు. వారికి అవసరమైన అవయవాలను అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. బ్రెయిన్‌డెడ్ బాధిత కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఒప్పిస్తున్నా... చివరి నిమిషంలో తప్పుకుంటున్నారు. దీనివల్ల కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇష్టం లేకుండా ఈ ప్రక్రియను చేపట్టడం లేదు. ప్రభుత్వం అవయవ దానం చేసిన వ్యక్తికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. విమ్స్‌లో అవయవదాన శస్త్రచికిత్సలను నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో మరింత మంది జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్

రాయి క్వారీలో నిబంధనల పాతర

... 5వ పేజీ తరువాయి

రాయి క్వారీని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నందుకు క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్లు కూలిపోయే ప్రమాదం



తేలు సత్యవతి



పి.చిలుకమ్మ

మా ఊరుకు సమీపంలో వున్న రాయి క్వారీ వల్ల రోజూ ఇబ్బందులు పడుతున్నాం. భారీ శబ్దాలు వచ్చేలా బోరు బ్లాస్టింగులు జరుపుతున్నారు. దీంతో ఇళ్ల గోడలు పగుళ్లిచ్చాయి. ఇళ్లు కూలిపోతాయేమోనని భయంగా వుంది. పంట పొలాల్లో దుమ్ము, ధూళి పేరుకుపోయి సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. క్వారీ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నాగమ్మ, తహశీల్దారు, రోలుగుంట

రాజన్నపేట సమీపంలోని క్వారీలో పేలుళ్లు నిర్వహిస్తుండడంతో ఇళ్లకు, పంట లకు నష్టం వాటిల్లుతున్నదని, సదరు క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల ని గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదు చేశారు. క్వారీ వద్దకు వెళ్లి పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్టు నిర్ధారణ అయితే క్వారీ నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

సాగని పేదల ఇళ్ల పనులు

... 5వ పేజీ తరువాయి

ఇంతవరకు పనులు ప్రారంభించని 2,682 మందిలో 850 మందికి గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. మిగిలిన వారికి కూడా ఒకటి, రెండు రోజుల్లో నోటీసులు జారీ చేయనున్నారు. అంతే కాక ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి, నిర్దీత గడువులోగా పూర్తి చేయకపోతే నిధులు రికవరీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీనిపై జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్న మాట వాస్తవమేనన్నారు. తొలి దశలో ఎంపిక చేసిన ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయితేనే రెండో దశ ఇళ్ల లబ్ధిదారులకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నదని మంత్రి చెప్పారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం కొత్తగా ఏర్పాటు చేసిన పార్కును, ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన రోడ్లను, టీడీపీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, జనసేన సీనియర్ నాయకుడు తోట నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యం

- హోం మంత్రి వంగలపూడి అనిత
- పీ-4 అమలుపై పారిశ్రామికవేత్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత. పక్కన కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల, సుందరపు

రాంబిల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పాలన చేస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం సెజ్‌లోని ఎంఎస్‌ఎంఈ భవనంలో పీ-4పై రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని పరిశ్రమల యాజమాన్యాలు, ప్రతినిధులతో స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో పేదరికం, ఆకలిబాధలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఒక మంచి ఆలోచనతో పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు. పేదరిక నిర్మూలనలో అందరి భాగస్వామ్యం అవసరమ న్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో వున్న వ్యక్తులు ముందుకు వచ్చి పేద కుటుంబాలను పైకి తీసుకురావడానికి మార్గదర్శులుగా వుండాలని కోరారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి అభివృద్ధికి కృషిచేయాల ని కోరారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లా డుతూ, పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చ డం పీ-4 లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేలు సుంద రపు విజయకుమార్, కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు భాగస్వా ములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆయిషాబేగ మ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



హాజరైన పారిశ్రామికవేత్తలు, అధికారులు

సెజ్ పరిశ్రమల్లో ప్రమాదాలపై అప్రమత్తం

- నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా
- రాంబిల్లి, అచ్యుతాపురం పీఎస్‌ల తనిఖీ



రాంబిల్లి పోలీసు స్టేషన్‌లో పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

రాంబిల్లి, అచ్యుతాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం రాంబిల్లి, అచ్యుతాపురం పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్‌ల పరిసరాలను పరిశీ లించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ప్రత్యేక ఆర్థిక మండలిలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్ర మాదాల విషయంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వుండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు డ్రంకెన్ డ్రైవ్, తనిఖీలు చేపట్టాలని, అతివేగం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటివాటిపై దృష్టి సారించాలని చెప్పారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, తగు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అచ్యుతాపురంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామని చెప్పారు. గంజాయి రవాణా, నాటుసా రా తయారీదారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అ నుమానాస్పదంగా సంచరించే వారిని ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేష న్ సిస్టమ్ ద్వారా తనిఖీ చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడంతోపాటు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రౌడీ షీటర్లు, చెడునడత కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాల న్నారు. నేరాల నియంత్రణకు రాత్రిపూట గస్తీని ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అపరిష్కృతంగా వున్న కేసుల గురించి తెలుసుకుని, త్వరగా పరిష్కరించాలని పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట రాంబిల్లిలో సీఐ నరసింగరావు, ఎస్ఐ నాగేంద్ర, అచ్యుతాపురంలో సీఐ నమ్మి గణేశ్, ఎస్ఐలు సుధాకర్, వెంకటరావు వున్నారు.

యూరియా వాడే పరిశ్రమల్లో తనిఖీలు

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో టెక్నికల్ గ్రేడ్ యూరియా వాడుతున్న పరిశ్రమల్లో తని ఖీలు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సబ్సిడీ యూరియాను పరిశ్రమలకు మళ్లించడంపై మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పరిశ్రమల, మత్స్య, కార్మిక శాఖలు, వి జిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ అవసరాల కోసం రాయితీపై సరఫరా చేసే యూరియాను ఈ పరిశ్రమలకు తరలించే అవకాశం వుందని అన్నారు. కార్మిక, వ్యవసాయ, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బృందాలుగా ఏర్పడి ఆయా పరిశ్రమల్లో తని ఖీలు నిర్వహించాలన్నారు. సబ్సిడీ యూరియాను వినియోగిస్తుంటే వెంటనే ఎరువుల నియంత్రణ చట్టం కింద కేసులు నమోదు చేయాలన్నారు. అనకాపల్లి జిల్లా నుంచి ఇతర జిల్లాలు; రాష్ట్రాలకు సబ్సిడీ యూరియా తరలించకుండా రవాణా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు ముమ్మరంగా తనిఖీలు చేయాలన్నారు. ఎరువుల దుకాణాల్లో 47 కిలోల యూరియా బస్తాను రూ.267కు మించి అమ్మకుండా దృష్టి సారించాలన్నారు.

క్రైం... crime news

రౌడీషీటర్ పప్పలనాయుడుపై దాడి

నర్సీపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రౌడీషీటర్ పప్పలనాయుడుపై కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గా యపరిచారు. దీనికి సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లిమెట్ల కూడలి బుచ్చింపేట రోడ్డులోని మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి పప్పలనాయుడుకి, కొంత మంది యువకులకు మధ్య గొ డవ జరిగింది. తరువాత పప్పలనాయుడు అక్కడ నుంచి నర్సీపట్నం చేరు కొని ఇంటి సమీపంలో కాలువ గట్టు మీద కుర్చొని వున్నాడు. బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఇతనిని ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తు న్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఉమామహేశ్వర రావు తెలిపారు.

హమ్మయ్య.. బయటపడ్డారు

- సరియా జలపాతం అవతలి వైపు చిక్కుకున్న 31 మంది పర్యాటకులు
- అందాలను తిలకించేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఉధృతంగా ప్రవహించిన గెడ్డ
- రోప్ సహాయంతో సురక్షితంగా తీసుకువచ్చిన పోలీసులు, వలంటీర్లు



పర్యాటకులను సురక్షితంగా తీసుకువచ్చిన పోలీసులు, వలంటీర్లు

అనంతగిరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతం అవతలి వైపు అందాలను తిలకించేందుకు వెళ్లిన 31 మంది పర్యాటకులు వరదలో చిక్కుకున్నారు. ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో అవతలి వైపే ఉండిపోయారు. విషయం తెలిసి పోలీసులు, వలంటీర్లు అక్కడికి చేరుకుని వారిని సురక్షితంగా రోప్ సహాయంతో ఇటు వైపునకు తీసుకువచ్చారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లికి చెందిన పలువురు పర్యాటకులు సరియా జలపాతాన్ని చూసేందుకు వచ్చారు. మధ్యాహ్నం వీరంతా అవతలి వైపు జలపాతం అందాలను తిలకించేందుకు గెడ్డ దాటి వెళ్లారు. వీరిలో కొందరు వెంటనే వచ్చేశారు. అయితే మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మిగతా 31 మంది పర్యాటకులు ఇటు వైపు రావడానికి ప్రయత్నించారు. వాస్తవానికి హుకుంపేట మండలం పరిధిలోని బాకూరు పక్కనున్న గెడ్డవలస గెడ్డ నుంచే సరియా జల పాతానికి నీరు వస్తుంది. ఎగువన భారీ వర్షం కురవడంతో ఒక్కసారిగా వరద నీరు వచ్చి గెడ్డ పొంగి ప్రవహించింది. దీంతో ఆ 31 మంది పర్యాటకులు ఇటు వైపు రాలేకపోయారు. ఈ విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్‌బ ర్ధార్, అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు దేవరాపల్లి ఎస్ఐ స త్యనారాయణ, చీడికాడ ఎస్ఐ సతీశ్, అనంతగిరి ఎస్ఐ శ్రీనివాసరావు, స్థానిక వలంటీర్లు అక్కడికి చేరుకున్నారు. తాడు సహాయంతో ఆ పర్యాటకులను ఇవతలి వైపునకు సురక్షితంగా తీసుకువచ్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చు కున్నారు. పర్యాటకులను సురక్షితంగా ఇటు వైపునకు తీసుకువచ్చిన వారిలో పోలీసులతో పాటు వలంటీర్లు మహేశ్, రాజు, రాము, టీడీపీ నాయకుడు సురేశ్ ఉన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519